రేపు జోగులాంబ అమ్మవారికి పట్టు వస్త్రాల సమర్పణ

గౌలిపురా: ఆషాఢ మాసం బోనాల ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 29న గౌలిపురా మురాద్‌మహల్‌లోని మహంకాళి నల్ల పోచమ్మ ఆలయం ఆధ్వర్యంలో అలంపూర్ జోగులాంబ ఆలయంలో అమ్మవారికి పట్టు వస్త్రాలను సమర్పించనున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. డప్పు చప్పుళ్లు, పోతురాజుల నృత్యాల మధ్య జోగులాంబ దేవాలయంలో అమ్మవారికి పట్టు వస్త్రాలను సమర్పించడం జరుగుతుందన్నారు.

ప్రత్యేక పూజలు



గోల్కొండ: గోల్కొండలో బోనాల ఉత్సవాలు రెండో రోజు కూడా కొనసాగుతున్నాయి. మొదటి రోజు బోనాల పూజకు రాని భక్తులు శుక్రవారం పెద్ద సంఖ్యలో కోటకు తరలివచ్చారు. మహిళలు సంప్రదాయ దుస్తుల్లో నగీనా బ్యారెక్స్‌లో బోనం కుండలను తయారు చేశారు. అమ్మవారికి సమర్పించడానికి నైవేద్యాలను కూడా సిద్ధం చేసుకున్నారు. ముందుగా భక్తులు నగీనాబాగ్‌లోని నాగదేవత పుట్టకు పూజలు చేసి తలలపై బోనం కుండలతో మెట్ల మార్గాన అమ్మవారి దర్శనానికి బయలుదేరారు.

శివలింగానికి మహా రుద్రాభిషేకం



జియాగూడ: లక్ష్మీనర సింహానగర్‌లోని బంగారు మైసమ్మ ఆలయంలో శుక్రవారం మాతేశ్వరీకి మహా రుద్రహోమం, శివలింగానికి మహా రుద్రాభిషేకం ఘనంగా నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున పూజల్లో పాల్గొన్నారు. అనంతరం అమ్మవారికి, శివలింగానికి ప్రత్యేక అలంకరణలు, అఖండ హారతులు నిర్వహించారు. చివరగా భక్తులకు తీర్థ ప్రసాద వితరణ జరిగాయి. ఈ కార్యక్రమంలో వేడుకల నిర్వాహకులు ఎం.శ్రీకాంత్, మదన్‌మోహన్, అర్చకులు సేనాపతి, శివ తదితరులు పాల్గొన్నారు.

నియామకం



నియామకపత్రాన్ని అందుకుంటున్న నితిన్ యాదవ్

నాంపల్లి: అఖిల భారత యాదవ మహాసభ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శిగా గైరబోని నితిన్ యాదవ్ నియమితులయ్యారు. రాష్ట్ర అధ్యక్షుడు చింతల రవీంద్రనాథ్ యాదవ్ ఆదేశాలతో జాతీయ ప్రధాన కార్యదర్శి ఆర్.లక్ష్మణ్ యాదవ్ సమక్షంలో రాష్ట్ర యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు గొర్ల యశ్వంత్ రాజ్ యాదవ్ నియామకపు ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా నితిన్ యాదవ్ మాట్లాడుతూ..అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శిగా నియమించినందుకు సంతోషంగా ఉందన్నారు. నాపై ఎంతో నమ్మకంతో ఈ నియామకం చేపట్టినందుకు జాతీయ, రాష్ట్ర కార్యవర్గానికి కృతజ్ఞతలు తెలియజేశారు.

జీహెచ్‌ఎంసీ-14వ సర్కిల్ ఏసీపీగా రమేష్‌కుమార్



అబిడ్స్: జీహెచ్‌ఎంసీ అబిడ్స్ 14వ సర్కిల్ టౌన్ ప్లానింగ్ ఏసీపీగా టీఎల్.రమేష్‌కుమార్ శుక్రవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. కొన్ని నెలలుగా ఏసీపీగా పనిచేసిన మంజుల సింగ్ బదిలీ కావడంతో కూకట్‌పల్లిలో విధులు నిర్వహిస్తున్న రమేష్‌కుమార్‌ను నియమిస్తూ జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా రమేష్‌కుమార్ మాట్లాడుతూ.. గోషామహల్ నియోజకవర్గం పరిధిలో అక్రమ నిర్మాణాలను పూర్తిగా నిరోధించేందుకు కృషి చేస్తామన్నారు.

పదో మొహర్రం సెలవును మార్చాలి



మీర్ ఫిరాసత్ అలీ బాక్రీ

చార్మినార్: పదో మొహర్రం సందర్భంగా వచ్చిన అధికారిక సెలవును మరుసటి రోజుకు అంటే.. వచ్చే నెల 7వ తేదీకి మార్చాలని బీజేపీ రాష్ట్ర మాజీ అధికార ప్రతినిధి మీర్ ఫిరాసత్ అలీ బాక్రీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. షియా ముస్లిం ప్రజలు 1వ మొహర్రం నుంచి 10వ మొహర్రం వరకు మజ్లిస్, మాతం నిర్వహించి వచ్చే నెల 6న పాతబస్తీ వీధుల్లో అంబారిపై బీబీకాఆలంను ఊరేగిస్తారని..ఆ రోజు అధికారికంగా సెలవుంటుందన్నారు. అయితే ఆ రోజు ఆదివారం కావడంతో మరుసటి రోజైన సోమవారానికి మార్చాలని ఆయన కోరారు.

తొలగించిన చెట్ల కొమ్మలను

తరలించేదెన్నడో?

విద్యుత్ తీగలకు అడ్డు తగులుతున్నాయని చెట్ల కొమ్మల నరికివేత

- కొమ్మలను రోడ్లపైనే వదిలేస్తున్న సిబ్బంది
- ఇబ్బందులు పడుతున్న స్థానికులు
- పట్టించుకోని అధికారులు



గాంధీనగర్‌లో రోడ్డుపైనే వదిలేసిన చెట్ల కొమ్మలు

చార్మినార్: అధికారుల నిర్లక్ష్యం..కాంట్రాక్టర్ సిబ్బంది అలసత్వం వెరసి స్థానికులకు తప్పని తిప్పలు. చెట్ల కొమ్మలను తొలగిస్తున్న విద్యుత్ అధికారులు వాటిని సకాలంలో అక్కడి నుంచి తొలగించకపోవడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. విద్యుత్ తీగలకు చెట్ల కొమ్మలు అడ్డు తగులుతున్నాయనే కారణాలతో టీజీఎస్‌పీడీసీఎల్ సెంట్రల్ బ్రేక్ డౌన్ అధికారులు, సిబ్బంది చెట్ల కొమ్మలను నరికేస్తున్నారు. నరికిన ఈ కొమ్మలను అక్కడి రోడ్లపై వదిలేసి చేతులు దులుపుకుంటున్నారు. వెంటనే తొలగించకపోవడంతో స్థానికులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఇష్టానుసారంగా చెట్లను నరుకుతుండడంతో ఆయా బస్తీల్లో పచ్చదనం కనుమరుగవుతోందని ఒకవైపు పర్యావరణ పరిశీలకులు లబోదిబోమంటున్నప్పటికీ పట్టించుకోని విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు..తొలగించిన చెట్ల కొమ్మలను కూడా సకాలంలో రోడ్లపై నుంచి తొలగించడం లేదు.

విద్యుత్ అధికారులదే బాధ్యత..

తొలగించిన కొమ్మలను జీహెచ్‌ఎంసీ సిబ్బంది తరలించాలని ఆయా బస్తీలు, కాలనీల ప్రతినిధులు కోరుతుండగా వీటిని తాము తరలించమని.. విద్యుత్ అధికారులే తొలగింపు చేస్తారని జీహెచ్‌ఎంసీ సిబ్బంది చెబుతున్నారు. టీజీఎస్‌పీడీసీఎల్ సెంట్రల్ బ్రేక్ డౌన్ అధికారుల పర్యవేక్షణలో చెట్ల కొమ్మల తొలగింపు జరిగినప్పుడు వారిదే బాధ్యత అని అంటున్నారు. ఈ చెట్ల కొమ్మల నరికివేత ప్రక్రియ పాతబస్తీ దక్షిణ మండలంలోని చార్మినార్, ఆస్మాన్‌ఘడ్, బేగంబజార్ డివిజన్ల పరిధిలోని సీబీడీ ఏడీఈ పరిధుల్లో నిరంతరం కొనసాగుతున్నప్పటికీ.. వెనువెంటనే ఆయా కొమ్మలను తరలించకపోవడంతో ఆయా ప్రాంతమంతా చెత్తా చెదారంతో నిండిపోతుంది.



ప్రధాన రోడ్డులో..

కాంట్రాక్టరే తరలిస్తారు..

బ్రేక్ డౌన్ కార్యక్రమాల సందర్భంగా సీబీడీ ఏడీఈ పర్యవేక్షణలో జరిగే చెట్ల కొమ్మల తొలగింపుతో పాటు వాటిని ఎప్పటికప్పుడు తరలించే బాధ్యత కూడా సంబంధిత కాంట్రాక్టరేదే. నరికిన చెట్ల కొమ్మలను సకాలంలో తరలించకపోతే వారిపై చర్యలు తీసుకుంటాం. స్థానికుల నుంచి ఫిర్యాదులు అందే వరకు ఉండకుండా ఎప్పటికప్పుడు తరలించే ప్రయత్నం చేస్తున్నాం. గతంలో జీహెచ్‌ఎంసీ సిబ్బంది తొలగించే వారు. అయితే ఇప్పుడు అలా కాకుండా మేమే సంబంధిత కాంట్రాక్టర్ ద్వారా తరలింపజేస్తున్నాం. ఎక్కడైనా సమస్య ఉంటే వెంటనే మా దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తాం.

– విష్ణువర్ధన్‌రెడ్డి, టీజీఎస్‌పీడీసీఎల్ ఆస్మాన్‌ఘడ్ డీఈ

గోల్కొండ అమ్మవారికి బంగారు బోనం



బంగారు బోనం సమర్పించిన లాల్‌దర్వాజ ఆలయ చైర్మన్ మారుతీ యాదవ్

లంగర్‌హౌస్/చాంద్రాయణగుట్ట: లాల్‌దర్వాజ సింహవాహిని అమ్మవారి తరఫున గోల్కొండలో మొక్కులు తీర్చుకున్నారు. లాల్‌దర్వాజ నుంచి బంగారు బోనాన్ని ఆలయ చైర్మన్ మారుతియాదవ్ ఆధ్వర్యంలో లంగర్‌హౌస్‌కు తీసుకువచ్చారు. అక్కడ నుంచి ఊరేగింపుగా గోల్కొండ కోటలోని జగదాంబిక మహంకాళి అమ్మవారి ఆలయానికి బంగారు బోనం తీసుకెళ్లి అమ్మవారికి సమర్పించారు. ఈ సందర్భంగా గోల్కొండ జగదాంబిక ఆలయ కమిటీ చైర్మన్ చంటిబాబు ఆ బంగారు బోనానికి స్వాగతం పలికారు. లాల్‌దర్వాజ ఆలయ నిర్వాహకులు చంద్రమోహన్, హరీష్ గౌడ్ సతీష్ ముదిరాజ్, అమర్‌యాదవ్, శేష నారాయణ, విష్ణు, గోల్కొండ జగదాంబిక ఆలయ సభ్యులు శ్రీకాంత్ యాదవ్, నాయకులు పరమానందం పాల్గొన్నారు.

వైభవంగా జగన్నాథ రథయాత్ర

గన్‌ఫౌండ్రీ: ఇస్కాన్ టెంపుల్ ఆధ్వర్యంలో నిర్వహించిన పూరీ జగన్నాథ రథయాత్ర భక్తులతో జన సంద్రంగా మారింది. జై జగన్నాథ్ అనే నినాదాలతో భక్తులు హోరెత్తించారు. సికింద్రాబాద్ నుంచి ప్రారంభమైన ఈ యాత్ర వివిధ ప్రాంతాల మీదుగా సాగి నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానం వద్ద నిలిచింది. జగన్నాథ రథయాత్రను తిలకించేందుకు భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. రథయాత్ర సాగే దారిపొడవునా మహిళా భక్తులు రంగు రంగుల ముగ్గులతో స్వాగతం పలికారు.

చాంద్రాయణగుట్టలో..

చాంద్రాయణగుట్ట: చాంద్రాయణగుట్టలో శుక్రవారం జగన్నాథ స్వామి రథయాత్ర కనుల పండువగా కొనసాగింది. జగన్నాథుడు, సుభద్రాదేవి, బలబద్రులను భారీ రథంపై ప్రతిష్ఠించి ఊరేగింపు నిర్వహించారు. అంతకుముందు జగన్నాథ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు, యజ్ఞం, పూర్ణాహుతి లను నిర్వహించారు. శక్కర్‌గంజ్ పార్థివాడలోని ప్రాచీనమైన జగన్నాథ స్వామి ఆలయం నుంచి ప్రారంభమైన యాత్రకు స్థానిక భక్తులు స్వాగతం పలికారు. సున్నితమైన ప్రాంతాలు కావడంతో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.



జగన్నాథ రథయాత్రలో భారీగా జనసంద్రోహం

ఇస్కాన్ రథయాత్రలో ఎమ్మెల్యే రాజాసింగ్ పూజలు..

అఫ్జల్‌గంజ్: ఇస్కాన్ టెంపుల్ ఆధ్వర్యంలో నిర్వహించిన పూరీ జగన్నాథ రథయాత్రలో గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ పాల్గొని పూజలు చేశారు.



శక్కర్‌గంజ్‌లో కొనసాగుతున్న రథయాత్ర



రథయాత్రలో పాల్గొన్న ఎమ్మెల్యే రాజాసింగ్

స్కూల్ పిల్లల వాహనాల డ్రైవర్లకు డ్రంకన్ డ్రైవ్ తనిఖీలు

అఫ్జల్‌గంజ్: స్కూల్ పిల్లల వాహనాల డ్రైవర్లకు అబిడ్స్ ట్రాఫిక్ పోలీసులు డ్రంకన్ డ్రైవ్ తనిఖీలు చేశారు. గన్‌ఫౌండ్రీ చాపల్ రోడ్డు పరిధిలోని స్లేట్ ద స్కూల్, సుజాత హైస్కూల్, స్టాన్లీ విద్యా సంస్థలు, ఇతర పలు విద్యా సంస్థల బస్సులు, ఆటో డ్రైవర్లకు ఇన్‌స్పెక్టర్ రవికుమార్ ఆధ్వర్యంలో డ్రంకన్ డ్రైవ్ తనిఖీలు చేపట్టారు. నగర ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ జోయల్ డేవిస్ ఆదేశాలతో పాఠశాలలు, కళాశాలలు బస్సులు, ఆటో డ్రైవర్లకు అకస్మిక తనిఖీలు చేపట్టారు. చాపల్ రోడ్డులో ఓ ఆటోడ్రైవర్ తాగి ఆటో నడుపుతుండగా అతనిపై కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ..ప్రతి ఆటో డ్రైవర్ పరిమిత సంఖ్యలో పిల్లలను ఎక్కించుకోవాలన్నారు.



అబిడ్స్ సుజాత స్కూల్ వద్ద తనిఖీ నిర్వహిస్తున్న ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ తదితరులు

మొహర్రం సంతాప దినాలు ప్రారంభం



చార్మినార్: షియా ముస్లింలు 68 రోజుల పాటు నిర్వహించే మొహర్రం సంతాప దినాల్లో భాగంగా అన్ని ఆషుర్‌ఖానాల్లో గురువారం రాత్రి ఆలంలను ప్రతిష్ఠించారు. దీంతో శుక్రవారం నుంచి మొదటి మొహర్రం సంతాప దినాలు ప్రారంభమయ్యాయి. హజ్రత్ ఇమాం హుస్సేన్ ఆత్మకు శాంతి కలగాలని కోరుతూ షియా ముస్లింలు ప్రతి రోజు ఆషుర్‌ఖానాలలో మజ్లిస్, మాతం నిర్వహిస్తారు. సంతాప దినాలను పురస్కరించుకొని డబీర్‌పురా బీబీకాఆలావాలో ప్రతిష్ఠించిన ఆలంలకు షియా ముస్లింలు దట్టీలు కట్టి మొక్కులు చెల్లించుకున్నారు. 10వ మొహర్రంను పురస్కరించుకుని వచ్చే నెల 6న చార్మినార్ ప్రధాన వీధుల్లో అంబారిపై బీబీకాఆలంతో సామూహిక ఊరేగింపు నిర్వహించనున్నారు.

బోనాలను ఘనంగా నిర్వహిస్తాం



గోల్కొండ: బోనాలను కాంగ్రెస్ ప్రభుత్వం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. సబ్జిమండీ నటరాజ్ నగర్‌లోని నల్లపోచమ్మ మహంకాళి ఆలయ 103వ బోనాల ఉత్సవాల ఆహ్వాన పత్రాన్ని శుక్రవారం ఉమ్మడి ఆలయ కమిటీ సభ్యులు ఆయనకు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..తెలంగాణ ప్రభుత్వం గతంలో ఎన్నడూ లేని విధంగా బోనాలను భారీ స్థాయిలో నిర్వహిస్తుందని దీనికి గురువారం ప్రారంభమైన గోల్కొండ బోనాలు నిదర్శనమని ఆయన అన్నారు. ఆయనను కలిసిన వారిలో ఆలయ కమిటీ అధ్యక్షుడు దొర్తుల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి కట్ట శ్రీనివాస్, కోశాధికారి దేశబోయిన గోపాల్, సలహాదారులు శ్యామ్‌సుందర్, నందకిషోర్, నర్సింగ్‌రావు, భాస్కర్, రమేష్ తదితరులున్నారు.

రమణయ్యకు తెలంగాణ స్పోర్ట్స్ ఐకాన్ అవార్డు



సుల్తాన్‌బజార్: ఇటీవల అంతర్జాతీయ అథ్లెటిక్స్‌లో మూడు బంగారు పతకాలు సాధించిన అంతర్జాతీయ క్రీడాకారుడు రాళ్ల రాచర్ల రమణయ్యకు తెలంగాణ స్పోర్ట్స్ ఐకాన్ అవార్డు లభించింది. విశ్వ ఆర్ట్స్ మన కళాక్షేత్రం ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇటీవల త్యాగరాయగాన సభలో జరిగిన కార్యక్రమంలో మల్కాజ్‌గిరి కోర్టు విశ్రాంత న్యాయమూర్తి బూర్గుల మధుసూధన్ హాజరై రమణయ్యకు అవార్డు ప్రదానం చేసి సత్కరించారు. రమణయ్యకు అవార్డు రావడంపై అరబిందో భవన్స్ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్, సిబ్బంది, రాష్ట్ర, జాతీయ క్రీడాకారులు హర్షం వ్యక్తం చేశారు. సీనియర్ నటుడు రాజేందర్, సంస్థ నిర్వాహకులు డాక్టర్ రంజిత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అన్ని ఆలయాల వద్ద తాగునీటి వసతిని కల్పించండి



అఫ్జల్‌గంజ్: బోనాల పండుగకు అన్ని ఆలయాల వద్ద తాగునీటి వసతిని కల్పించాలని గోషామహల్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ నాయకుడు ఎం.ఆనంద్‌కుమార్‌గౌడ్ వాటర్‌బోర్డు ఎండీ అశోక్‌రెడ్డిని కోరారు. ఈ మేరకు వాటర్ బోర్డు ఎండీని ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆనంద్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ..బోనాల పండుగకు అన్ని ఏర్పాట్లు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. అశోక్‌రెడ్డి మాట్లాడుతూ..అన్ని ప్రాంతాల్లో కలుషిత నీరుకాని, ఇతర వాటర్‌బోర్డు సమస్యలు తమ దృష్టికి తెస్తే వెంటనే ఆయా సంబంధిత వాటర్ బోర్డు మేనేజర్లు, డీజీఎంలు, జీఎంలు సంబంధిత సమస్యలను పరిష్కరిస్తారని వెల్లడించారు. అహ్మద్, నరేష్‌గౌడ్ పాల్గొన్నారు.

దివ్యాంగులు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలి



విజేతలతో సీతాదయాకర్‌రెడ్డి, అలేఖ్య పుంజాల తదితరులు

గన్‌ఫౌండ్రీ: దివ్యాంగులు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలని రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్‌పర్సన్ సీతాదయాకర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం రవీంద్రభారతిలో భాషా, సాంస్కృతిక శాఖ, సంగీత నాటక అకాడమీల సౌజన్యంతో ఫ్రెండ్లీ ఎన్విరాన్‌మెంట్ ఫర్ ది డిసబుల్డ్ సంస్థ ఆధ్వర్యంలో హెలెన్ కిల్లర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీతా దయాకర్‌రెడ్డి మాట్లాడుతూ..ఈ రోజుల్లో చాలా మంది చిన్న చిన్న విషయాలకే ఆత్మహత్యలకు కాల్పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అంగవైకల్యంతో బాధపడుతున్న చిన్నారులు ఏమైన సమస్యలు ఉంటే కమిషన్ దృష్టికి తీసుకురావాలని కోరారు. అనంతరం హెలెన్ కిల్లర్, జీవిత చరిత్రపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. అంతకు ముందు వికలాంగుల సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు ఆకట్టుకోగా ఓ దివ్యాంగ చిత్రకారిణి గీసిన చిత్రాలు అబ్బురపరిచాయి. ఈ కార్యక్రమంలో సంగీత నాటక అకాడమీ చైర్‌పర్సన్ అలేఖ్య పుంజాల, భాషా, సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, సరస్వతి ఉపాసకులు దైవాజ్ఞశర్మ, ఎల్‌ఐసీ జోనల్ ఆఫీసర్ సుబ్రమాణ్యం, సంస్థ కార్యదర్శి చెరుకు నాగభూషణం పాల్గొన్నారు.

పుణ్యక్షేత్రాల బస్సు సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలి



చాంద్రాయణగుట్ట: ఆర్టీసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పుణ్యక్షేత్రాల దర్శనం ప్రత్యేక బస్సు సదుపాయాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని ఫారూఖ్‌నగర్ డిపో మేనేజర్ వేదవతి తెలిపారు. డిపో ఆధ్వర్యంలో చేపట్టిన మొదటి టూర్ ప్యాకేజీ బస్సును శుక్రవారం ఆమె ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ..డిపో ఆధ్వర్యంలో ప్రత్యేక మెట్రో డీలక్స్ బస్సులలో సురక్షితం, సుఖవంతం, సౌకర్యవంతమైన పిక్నిక్ వాతావరణంలో పుణ్యక్షేత్రాలకు తీసుకెళుతున్నామన్నారు. మొదటి రోజు 41 మందితో గూడెంగుట్ట, ధర్మపురి, కొండగట్టు, వేములవాడ ట్రిప్ బయల్దేరిందన్నారు. వారాంతాల్లో పెద్దలకు రూ.500, చిన్నారులకు రూ.300ల చొప్పున ఉన్న ఈ ప్యాకేజీని సద్వినియోగం చేసుకోవాలని, మరింత సమాచారం కోసం 733734 6169లో సంప్రదించాలన్నారు.

సామూహిక కుంకుమార్చన

యాకుత్‌పురా: బోనాల ఉత్సవాల సందర్భంగా హరిబౌలీ అక్కన్న మాదన్న మహంకాళి ఆలయంలో శుక్రవారం అమ్మవారికి సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. ఉదయం అమ్మవారికి అభిషేకం, వివిధ రకాల పూలతో అలంకరణ, మహా హారతి ఇచ్చారు. ఉదయం 11 గంటలకు నిర్వహించిన కుంకుమార్చనలో స్థానిక ప్రాంతాలకు చెందిన మహిళలు పాల్గొన్ని అమ్మవారికి అర్చన చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు డి.ఆర్. ప్రభాకర్, ప్యాట్రాన్ జి.నిరంజన్, కార్యదర్శి కె.దత్తాత్రేయ, ప్రతినిధులు రాందేవ్ అగర్వాల్, ఏ.సతీష్, ఎస్.పి క్రాంతికుమార్, జగ్మోహన్ కపూర్, కృష్ణ, వినోద్, చేతన్ సూరి పాల్గొన్నారు.



సామూహిక కుంకుమార్చన చేస్తున్న మహిళలు

భక్తిశ్రద్ధలతో మహంకాళేశ్వరి మహాభిషేకం



పూజల్లో ఆలయ కమిటీ చైర్మన్ గాజుల అంజయ్య దంపతులు

చార్మినార్: మీరాలంమండి మహంకాళేశ్వర ఆలయంలో శుక్రవారం మహంకాళేశ్వరి మహాభిషేకం పూజలు పాతబస్తీలోనే అత్యంత ప్రతిష్టాత్మకంగా జరిగాయి. మీరాలంమండి మహంకాళేశ్వర ఆలయ కమిటీ చైర్మన్ గాజుల అంజయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ పూజలు శ్రీ చాముండేశ్వరి గురుత్త పీఠం కొడకండ్ల శ్రీరామ శరన్ శర్మ చేతుల మీదుగా జరిగాయి. 108 కలశాలు, గణపతి, సుబ్రహ్మణ్య స్వామి, ఆంజనేయస్వామి, నవగ్రహ దేవతా విగ్రహాలకు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా చర్యలు తీసుకున్నారు. పూజల నేపథ్యంలో ఆలయ గోపురంతో పాటు ఆలయ ప్రాంగణం, గర్భగుడి, ప్రధాన ద్వారం, ధ్వజ స్తంభాన్ని పుష్పాలు, విద్యుత్ దీపాలతో అలంకరించారు.

నేటి నుంచి జూలై 18 వరకు..

బోనాల ఉత్సవాల్లో భాగంగా మహంకాళేశ్వర ఆలయంలో 21 రోజుల పాటు రుద్ర సహిత త్రిశత చండీ మహాయాగాన్ని నిర్వహించడానికి తగిన ఏర్పాట్లు చేశారు. ఈనెల 28 నుంచి జూలై 18వ తేదీ వరకు ఈ రుద్ర సహిత త్రిశత చండీ మహాయాగం జరుగనున్నాయని గాజుల అంజయ్య తెలిపారు. గురుదేవతా ప్రార్థన, గణపతి పూజ పుణ్య హవచనం, అంకురార్పణ, ధ్వజారోహణం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నామన్నారు.

కార్వాన్ నియోజకవర్గం అభివృద్ధికి కృషి చేయాలి

గోల్కొండ: కార్వాన్ నియోజకవర్గం అభివృద్ధికి కృషి చేయాలని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా కలెక్టర్ దాసరి హరిచందనను కలిశారు. కుల్సుంపురా, లంగర్‌హౌస్, గోల్కొండ తదితర ప్రాంతాల్లో ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో వేలాది మంది విద్యార్థులు చదువుతున్నారన్నారు. అయితే ఈ పాఠశాలల్లో విద్యార్థులకు మరిన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. అదే విధంగా గోల్కొండలోని బీజేఆర్ ప్రభుత్వ బాలికల పాఠశాల, మహిళల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సైతం మౌలిక సదుపాయాల కొరత ఉందని ఆయన తెలిపారు. ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలకు సొంత భవనం లేదని ఆయన కలెక్టర్ దృష్టికి తెచ్చారు. గోల్కొండ ఏరియా ఆసుపత్రిలో వైద్యుల కొరత ఉందన్నారు. గతంలో బదిలీ అయిన వైద్యుల స్థానంలో పూర్తిగా భర్తీ కాలేదన్నారు. సంబంధిత అధికారులతో మాట్లాడి అవసరమైన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ఎమ్మెల్యేకు హామీ ఇచ్చారు.



కలెక్టర్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌసర్

ఆకట్టుకున్న గొల్ల రామవ్వ నాటక ప్రదర్శన



గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర భాషా, సాంస్కృతిక శాఖ సౌజన్యంతో క్రియేటివ్ థియేటర్ ఆధ్వర్యంలో గొల్ల రామవ్వ అనే నాటకాన్ని శుక్రవారం రవీంద్రభారతిలో ప్రదర్శించారు. నిజాం ప్రభుత్వంలో చోటుచేసుకున్న దుర్మార్గాలపై సాగిన ఈ నాటకం నాటక ప్రియులను భాగోద్వేగానికి గురిచేసింది. ఈ సందర్భంగా భాషా, సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ మాట్లాడుతూ..ప్రస్తుత సమాజంలో అంతరించిపోతున్న నాటక రంగాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఎంతగానో ఉందన్నారు. పూర్వ ప్రధానమంత్రి పీవీ.నర్సింహారావు మూలకథతో మంకెనపల్లి అజయ్ దర్శకత్వం వహించిన తీరు ఎంతో బాగుందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో అంబేడ్కర్ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ డాక్టర్ రాజు, క్రియేటివ్ థియేటర్ వ్యవస్థాపకులు ఎం.అజయ్ తదితరులు పాల్గొన్నారు.

మత సామరస్యానికి ప్రతీక బోనాలు



గోల్కొండ: మత సామరస్యానికి ప్రతీక బోనాలు నిలుస్తాయని రాష్ట్ర బీజేపీ సీనియర్ నాయకుడు డాక్టర్ భగవంతరావు, గోవింద్‌రాఠీ పేర్కొన్నారు. తెలంగాణ ప్రజలు వైభవోపేతంగా నిర్వహించే బోనాలకు రాష్ట్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున ఏర్పాటు చేయాలన్నారు. గోల్కొండ బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న డాక్టర్ భగవంతరావు, గోవింద్‌రాఠీని సీనియర్ నాయకుడు లక్ష్మణ్‌యాదవ్ ఘనంగా సత్కరించారు.

ప్రార్థనలు ప్రశాంతం

శాలిబండ: మక్కా మసీదులో శుక్రవారం సామూహిక ప్రార్థనలు ప్రశాంతంగా జరిగాయి. ఈ ప్రార్థనల్లో మాజీ కార్పొరేటర్ మోసిన్ బలాలతో పాటు ముస్లింలు పాల్గొన్నారు. శుక్రవారం సామూహిక ప్రార్థనల సందర్భంగా దక్షిణ మండలం పోలీసుల ఆధ్వర్యంలో గట్టి బందోబస్తును ఏర్పాటు చేశారు.

